
# మధనమున మనసై... — శ్యామ



మధ్యాహ్నం. లంచ్ అవర్‌లో ఆఫీసు కేంటిన్‌కి వెళ్తుంటే ఎదురొచ్చాడతను — సన్నగా ఎర్రగా వున్నాడు.

"సంఘమిత్రగారంటే మీరేనా మేడమ్?" — అన్నాడు.

"అవును" — అని నేనగానే నా చేతిలో ఓ కవరు పెట్టి వెళ్ళిపోయాడు.

నేను అతను వెళ్ళిన వైపు క్షణం ఆశ్చర్యంగా చూసి, ఆ తరువాత అతను నా కిచ్చిన కవరు చించి, లోపలి పేపరు బయటకు తీసి చూశాను. ఆ అక్షరాలు... నావే. చదవటం మొదలెట్టాను — ఆత్రంగా.

సంఘమిత్రా!

రేపు సాయంత్రం ఆరు గంటలకు 'ఆ' కొండ మీదకు నువ్వు రావాలి. రావటమంటే వూర్కే వచ్చి - పలకరించి, కబుర్లు చెప్పి వెళ్ళిపోవటానికి కాదు సుమా. నువ్వు నీ బంధాలన్నింటినీ తెంచేసుకుని పూర్తిగా నాదానివిగా రావాలి. ఒకవేళ నువ్వు రాకపోతే...

నీకు తెలుసు నేనేమిటో. అందుకే, నన్ను తలచుకుని నీ పిరికితనాన్ని వదిలేసుకుని, ఒక్క అడుగు నువ్వు ముందుకు వెయ్యి. చాలు. తరువాతంతా నిన్ను నేను నడిపించుకుంటాను — నాదానిగా చేసుకుని. ఏమంటావూ? వూహూ... నువ్వేమీ అనకూడదు. ఎందుకో తెలుసా? నువ్వు నీ మనసును నాకు 'కానుక' ఇచ్చావన్నావు. కనుక నేను చెప్పినట్లు చేయడమే నీ పని. నిన్ను నేను యింత గాఢంగానూ శాసించగలను. ఎందుకో తెలుసా? నేను నిన్ను గాఢాతిగాఢంగా ప్రేమిస్తూ, కోరుకుంటున్నాను గనుక. అర్థమయింది కదూ? అందుకే మరోమారు గుర్తు చేస్తున్నా. రేపు సాయంత్రం ఆరు గంటలకు. కొండ మీదికి (?) వస్తావు కదూ?

—లవ్,

నీ విమల్

గాడ్!! నేననుకుంటూనే వున్నాను. విమల్ నుండి ఎప్పుడో ఒకప్పుడు నేనిలాంటి 'సమన్'ని ఎదుర్కోవలసి వుంటుందని. అయితే... యింత తొందరలో అని మాత్రం అనుకోలేదు. ఇంతకూ —

పటిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్



'విమల్ ఎవరూ,' — అని నన్నడక్కండే. ఎందుకంటే వెంటనే నేను, 'సంఘమిత్ర ఎవరూ?' — అని నేను మిమ్మల్ని ప్రశ్నించవలసి వస్తుంది.

అప్పుడు మీరు ఆశ్చర్యంగా మీ నోటి మీదో, ముక్కు మీదో, మీ చూపుడు వేలేసుకుని, 'అదేమిటీ?! సంఘమిత్ర అంటే నువ్వే కదా?'' — అంటారు.

అప్పుడు నేను చిరునవ్వుతో అంటాను కదా — ''విమల్‌ని కూడా నేనే'' — అని.

నా జవాబు మీ కర్థం కాదు. కాక... అనుమానంగా అడుగుతారు.

''విమల్ అనేది నీ రెండో పేరా? అసలు నువ్వు అన్నది 'విమల్' అనా, లేక 'విమల' అనా?'' అంటారు.

''నేను అన్నది 'విమల్' అనే. విమల్ అనేది నా మొదటి పేరు. సంఘమిత్ర అనేది నా రెండో పేరు'' అంటాను.

విమల్!... విమల?... విమల!... విమల్... సంఘమిత్ర??!!

నేను చెప్పేది మీ కస్సలు అర్థంగాక గొప్ప గందరగోళంలో పడిపోతారు. పడిపోయి — ''మాకేం అర్థం కావటం లేదు'' అంటారు.

మీరో పాటలో ఒక చరణం విన్నారా? 'ఒక్కరం యిద్దరం అవుతుంటే—'' అదిగో సరిగ్గా అదే మేం. అందుకే మొదట్లో నేనన్నాను గుర్తుందా? విమల్ ఉత్తరంలోని అక్షరాలను చూస్తూ ''ఆ అక్షరాలు... నావే'' అన్నాను. ఇప్పుడర్థమయిందనుకుంటాను కదూ? మేమిద్దరం ఏమిటో.

ఇంతకూ మేమిద్దరం ఎలా కలిసేమో చెప్పమంటారా?

ఈ ఆఫీసులో టైపిస్ట్‌గా పని చేస్తున్నా. ఇప్పటికి నా పేరు మీకు తెలిసిపోయింది కానీ — నేనెలా వుంటానో చెప్ప లేదు కదూ? నేనెలా వుంటానంటే... వూహూ నా భాషలో వద్దు. విమల్ దృష్టిలో ... విమల్ భాషలో చెప్తేనే బావుంటుంది. విమల్‌తో నా పరిచయం పెరిగాక ఒకసారి విమల్-నేనూ, వెన్నెల్లో ఆకాశం క్రింద, మైదానంలో కూర్చున్నాము. ఎదురెదురుగా.

ఆకాశంలో వెన్నెల. మా యిద్దరి తలల మీద నుండీ, మా వళ్ళోకి జారుతోంది. నేను కాస్త మొహం వంచి మా యిద్దరి వడిలో నిండే వెన్నెలని చూస్తున్నాను.

''సంపంగి మొగ్గను వెన్నెల్లో చూట్టం యిదే ప్రథమం మైత్రీ'' — అన్నాడు. [అతను నన్ను 'మైత్రీ' అని పిలుస్తాడు.] నాకు తెలుసు అతని మనసు. అందుకే అర్థమైంది. తను నా ముక్కును సంపంగి మొగ్గ అన్నాడని. నాకు మాత్రం విమల్‌ని మొత్తంగా చూస్తే, విరిసిన సింహాచలం సంపంగిగానూ, విచ్చీ విచ్చని పెదవుల మధ్య అదిమిన నవ్వు చూస్తే జాజిమొగ్గల పరిమళంలానూ—

అతను నన్ను 'మైత్రీ' అంటూ పిలిస్తే, ఆ పిలుపులోని మమకారం మల్లెపూవు పరిమళంలానూ అనిపిస్తుంది. అదే నేనంటే —

''ఏయ్ మొద్దూ... యిదంతా నీ గురించి నేననుకునే భావం'' — అంటూ నా ముక్కు పట్టుకుని వూపుతూ అంటాడు. అతని స్పర్శ నాకు హాయినిపిస్తుంది. నేను హాయిగా మనసారా నవ్వేస్తే —

''అరే నా అజంతా బొమ్మ పారిజాతాలతో నన్ను అభిషేకిస్తుందే'' అంటూ తన రెండు చేతులను దోసిలి పడ్తాడు. ఇదీ నేనంటే. ఏం మీకిప్పుడు తెలిసిందా నేనెలా వుండేదీనూ? ఒక మాట. ఏమనుకోకండి కానీ, మీలో భావుకత వుంటేనే నన్ను మీరు వూహించగలరు. సరే... సంఘమిత్రా నువ్వెలా వున్నావో చెప్పుకున్నావు. మరి నీ విమల్ ఎలా వుంటాడు?'' — అంటారా.

ఉహూ... నేను చెప్పను. నిజం. ఎందుకంటే నాకు స్వార్థ మెక్కువ. విమల్ విషయంలో మాత్రమే సుమా!

ఇక విమల్‌తో నా పరిచయం.

.. .. ..

ఒక రోజు ఉదయం వేళ ఆఫీసులో, 'అర్జెంటుగా టైప్ చేసి యివ్వాలి' అంటూ మా బాస్ కొన్ని పేపర్లు యిచ్చారు. ఆ రోజు నా మనసు పని మీద లగ్నం కావటం లేదు. బయట వర్షం రాబోయే సూచనగా, ముసురు పట్టింది. మనసు బద్ధకంగా వుంది. నేను పేపర్లు అయితే తెచ్చుకుని, నా ముందు పెట్టుకున్నాను గానీ, టైప్ మిషన్‌లో పేపరు బిగించలేదు.

'ఇప్పుడు వర్షం వస్తే — ఉదయం పిండి ఆరవేసిన బట్టలు పెరట్లో వున్నాయి. అమ్మ తీస్తుందా, లేవలేక తీయదా? కాదూ మర్చిపోతుందా' — అని ఆలోచిస్తున్నాను.

నేను నా ఎదురుగా కిటికీలోంచి బయటకు, ఆకాశం వైపు చూశాను. గుండె ఝల్లుమంది. జవరాలి కంటి కోసం కాటుక తయారించి పెట్టి నట్లుంది, ఆకాశం.

గాడ్!

5-4-91 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

"మిస్" మెత్తనైన గొంతు శబ్దానికి ఉలిక్కిపడి, తల తిప్పి చూశాను. అంతే. మనసునేదో కదిలించి, మరేదో కొత్తనాదం శృతించినట్లయింది నాలో. వింతైన అనుభవం. మా ఆఫీసులో, మా యింటి పక్కలా, చాలా మంది మగవాళ్ళు వున్నారు. చూస్తూనే వుంటాను ఏదో సందర్భంలో. కానీ నా మనసెప్పుడూ యిలా కదిలి, మూర్ఛిల్ల లేదు. నిజం... నిజంగా నిజం. అతను క్షణం మౌనంగా నా మొహంలోకి చూసి —

"మిస్. ఇప్పుడు మీ దగ్గర వున్న పేపర్లు నాకు సంబంధించినవి. మీరు కాస్త తొందరగా టైపు చేసి యిస్తే, ఆఫీసరుగారి చేత సైన్ చేయించుకుని తీసుకు వెళ్ళాలి" — అని.

"ఆ బైది బై నా పేరు విమల్" — అన్నాడు.

నేనింకా విస్మయంగా చూస్తూ, అసంకల్పితంగా "నా పేరు —" నేను చెప్పబోతూంటే, "తెలుసు. సంఘమిత్ర. మీ ఆఫీసరుగారు చెప్పారు. 'సంఘమిత్ర గారి సీటులో వున్నాయి మీ పేపర్లు. కాస్త వెళ్ళి అర్జెంటని చెప్పి, టైప్ చేయించుకోమన్నారు. మీ పేరు వినగానే, ఏ సింహళీయులో అనుకున్నాను సుమా" — అన్నాడు పెదవి మధ్యన నవ్వుని బిగించి.

నా కప్పుడతని చనువుకి కోపం వచ్చిన మాట నిజమేగానీ, అతను మా ఆఫీసరుకి దగ్గరై వుండాలి. లేకుంటె — ఆయన అలా చెప్పి పంపరు. అందుకే చకచకా టైప్ చేయటంలో నిమగ్నమయ్యాను.

నేను టైపు చేసిన పేపర్లు అన్నీ కలిపి, బొత్తి చేసి, అతనికిచ్చాను. అతను 'థాంక్స్' చెప్తాడనుకున్నాను. కానీ అతను—

"మీ జ్వాల నా గుండెను రగుల్చుతుంటే, ఈ పేపర్ల కోసం నేను మీకు థాంక్స్ ఎలా చెప్పేది?!" — అన్నాడు.

నా కతను చెప్పేది అర్థంకాక, "జ్వాల ఏంటి?" అన్నాను, అయోమయంగా.

అతను అక్కడి నుండి కదిలి వెళ్తూ చెప్పాడు.

"మీ సౌందర్య జ్వాల మిస్."

ఒక సంకీర్ణ రాగం నాలో ప్లాలితమై...

మొట్టమొదటిసారిగా నా కర్థమైంది. కాదు నన్ను నేను తెలుసుకున్నాను. నాలో వయసు వెల్లువ సందడి ప్రారంభమైనదని.

నేను నిరీక్షించే శ్రమ లేకుండానే, విమల్ నా దగ్గరకు వచ్చేవాడు తన పని కోసం. నాకు ఇంట్లో గడిపే కాలం యుగాల నిరీక్షణ లాగానూ, ఆఫీసులో విమల్ వచ్చినప్పుడు —
పూర్వజన్మపు చివరి ఘడియ నుండి ప్రారంభమైన వెతుకులాట అప్పుడు అతన్ని వీక్షించటంలో అంతమైనట్టు గాను అనుభూతించేదాన్ని.

అయితే చాలా తొందరగా మా మధ్య ఎటువంటి హిపోక్రసీలు లేకుండా మమ్మల్ని మేం నివేదించుకున్నాం. ఇక నా కథ.

మధ్యతరగతి మర్యాదపు మందహాసాలతో మా నాన్న నలుగురు ఆడపిల్లల్ని పుట్టించాడు. 'అయ్యో రామమూర్తిగారూ-మనలాంటి మధ్యతర గతి వాళ్ళకు మగపిల్లలే వరాలూ, సంపదలూనండీ. అయినా పుత్రుడే కదండీ మన్ని పున్నామ నరకం నుండి రక్షించవలసినవాడు. అటువంటి కొడుకు లేకపోతే యిక మీ వంశానికి నామరూపాలేవండీ? అని ప్రశ్నించే వారందరి మాటలు విని నిజమని భ్రమించి, బాధ్యతలు గుర్తించకుండా మా నలుగురు ఆడపిల్లల్ని కన్నారు. ఆనక నిండా మునిగిన నానికి చలేమిటి అన్నట్టు- 'నారు పోసిన వాడు నీరు పోయడా'- అనే మూర్ఖత్వంతో మా అమ్మ మళ్ళీ - అదే మీకర్థమైంది కదూ?

అప్పటికి నాకు పన్నెండు సంవత్సరాలు అమ్మకి కాన్పులపనీ, నాకింటి పనీ తప్పేట్లు లేదు. ఒకవైపు చెల్లెళ్ళను కనిపెడ్తూ, మరోవైపు స్కూలు కెళ్ళటం. అలసట. చిన్నతనంలోనే పెద్దరికం వచ్చేసినట్లనిపించేది.

"ఈసారైనా మా రామమూర్తికి మగ నలుసు పుడితే?"-బంధువుల ఆకాంక్ష. మొత్తం మీద మా అమ్మ 'ఉత్తమ ఇల్లాలి నందోయ్' అన్నట్టుగా కొడుకుని కంది. మరి తమల్ని (మా అమ్మను కూడానా) పున్నామ నరకం నుండి రక్షిస్తాడనే గొప్ప కృతజ్ఞతతో అనుకుంటా-తన ఆరోగ్యాన్ని కూడా వాడికి బహుమతి చేసింది. ఫలితంగా అమ్మకు నరాల బలహీనత మొదలైంది. వాడ్ని చూట్టం అనేది నాకు అదనపు బాధ్యత అయింది. 'మొత్తం మీద ఎలాగయితే కొడుకుని కనేసాను' అనుకున్నాడో ఏమో మా నాన్న అప్పటి నుండి కాస్త కాస్త యింటి పట్ల శ్రద్ధ తగ్గించుకుంటూ వచ్చాడు. ఇంట్లో ఆర్థిక బాధలు పెరగసాగాయి. నేను ఎస్.ఎస్.సి. పాసయ్యే సరికి మా అమ్మ చాలా వరకు మంచానికి నేస్తం అయిపోయింది. నాన్న ఏ అర్థరాత్రో యింటికి వస్తూ-'అర్థరాత్రి అతిథి' అయ్యాడు మాకు. ఇంటికి పెద్ద కూతుర్ని నేను కదా. ఇప్పుడు బంధువులంతా అది చూస్తే అలా మంచం పట్టింది-వాడు చూస్తే అలా బాధ్యతలు పట్టించుకోకుండా తిరుగుతున్నాడు.

చలాది సుబ్రహ్మణ్యం సీరియల్-
క్రైమ్ రిపోర్టర్
త్వరలో!

ఇక మీ యింటికి కొడుకువైనా, కూతురువయినా నువ్వే అమ్మడూ. చూట్టానికి బంగారు బొమ్మలా కన్ను చెదిరిపోయేలా వున్నావు. ఎక్కడైనా వుద్యోగానికి ప్రయత్నించు. కళ్ళకద్దుకుని మరీ వుద్యోగమిస్తారు" అంటూ హితం చెప్పసాగారు. అప్పటికి ఎంత వయసనీ నాది? వసంతుణ్ణి ఆహ్వానించ వలసిన వయసులో వుద్యోగానికై వేట! నా అదృష్టం. సరిగ్గా అలాంటి సమయంలో మా ఎదురింట్లో ఒక వృద్ధుడు కొత్తగా టైప్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభించారు. నేను యింట్లో పనంతా ముగించుకుని నా కోసం కాస్త సమయాన్ని మిగుల్చుకుని ఆ వృద్ధునికి సహాయం చేసేదాన్ని. ప్రతిఫలంగా ఆయన నాకు టైప్ నేర్పించి, ఆ తర్వాత యిదిగో యిక్కడ ఈ ఆఫీసులో వుద్యోగం యిప్పించారు. 'నిన్ను కన్నాను'-అని చెప్పుకునే తల్లిదండ్రులు నాకేం చెయ్యలేదు. ఏ బంధముందని ఈ అపరిచితుడు నన్ను నన్నుగా నిలబడజేసాడు? ఎందుకు? చాలా సార్లు ఈ ప్రశ్న నన్ను నేను ప్రశ్నించు కున్నాను అప్పట్లో చాలా సార్లు. అయితే విమల్ పరిచయం కాక ముందు వరకు నా బ్రతుకు యాంత్రికంగా గడిచిపోయేది. మా అమ్మ నాన్నలకు మాత్రం వేన్నీళ్ళకు చన్నీళ్ళు తోడైనట్టు ఆనందించేవారు. ప్రస్తుతం వున్నాను నరకం నుండి తప్పించ వలసిన కొడుకు మాత్రం యింట్లో నరకాన్ని సృష్టిస్తున్నాడు. అమ్మా నాన్నల అతి గారాబంతో చదువు రావటం లేదు. చెల్లెళ్ళు పెద్ద అవుతున్నారు. అమ్మ చాలాసార్లు వాళ్ళను దగ్గరకు తీసుకుని "పెద్దదాని అందంలో కాస్త కూడా వీళ్ళకెవ్వరికీ రాలేదు" అని విచారించేది. అది నాకు కాంప్లిమెంట్ కాదు. నాదికాని నాపై బలవంతంగా, అన్యాయంగా రుద్దబడిన బరువు నుండి నేను తప్పించుకోకుండా వుండినట్టు 'మీ పెద్దమ్మాయి సంఘమిత్రను తప్ప మరెవ్వరినీ మా వాడు చేసుకో నంటున్నాడు'. 'మీ అమ్మాయిని మా అబ్బాయికి మాట్లాడటానికి వచ్చాం'- అనే వాళ్ళకంతా మా నాన్న కనిపించక ఎస్కేప్ అయ్యేవాడు. మా అమ్మ మంచం మీద మరింత బిగుసుకుపోయి మాట రానట్టు వీలుక్కు పోయేది.

ఇటువంటి పరిస్థితిలో విమల్ పరిచయమయ్యాడు. అసలు విమల్ లాంటి వ్యక్తి పరిచయం అవ్వటం కోసమే నా యింటి పరిస్థితులు అలా సృష్టించబడ్డాయేమో! నేను విమల్‌ని ఒక ఆదివారం ఉదయమే మా యింటికి పిలిచి యింట్లో అందరికీ పరిచయం చేసాను. విమల్‌ని పరిచయం చేస్తుంటే మా నాన్న ముఖంలో మబ్బులు. అమ్మ కళ్ళల్లో భయం. విమల్ అయిదు నిముషాలు మాత్రమే మా యింట్లో వున్నాడు. విమల్ వెళ్ళి పోయాక నాకనిపించింది.

విమల్‌లో నా పట్ల యిప్పుడు ఎటువంటి ఆలోచనలు వుంటాయోనని.

ఆ తర్వాత విమల్ నన్ను కలిసినప్పుడు చెప్పాడు. "మైత్రీ! నువ్వు యింత వరకు ప్రేమ రాహిత్యపు ఎడారిలో పయనిస్తున్నా ఒంటరిదానివని అనుకోలేదు సుమా. నేను మీ యింట్లో గమనించిందేమిటో తెలుసా? మీ పేరెంట్స్‌కి నువ్వు పెళ్ళి చేసుకుని వెళ్ళిపోవడం అసలు యిష్టం వున్నట్టు లేదు. అవునా!"

"నాకు తెలుసు విమల్" నేను నిర్వేదంగా చెప్పాను.

"ఒక్క నిజం చెప్పు సంఘమిత్రా, నువ్వు నిజంగా నన్ను ప్రేమిస్తు న్నావా?" నాకు విమల్ నా పూర్తి పేరుతో పిలిచే సరికి దిగులనిపించింది. అందుకే "విమల్ నువ్వు నన్ను 'మైత్రే' అని పిలవకుండా నన్ను నీ నుండి దూరం చేస్తున్నట్టుగా పూర్తి పేరుతో ఎందుకు పిలిచావు?" మాటలతో పాటు నా కన్నుల్లో నీటి చెలమలు. విమల్ వెంటనే నా ముఖాన్ని తన అరచేతుల మధ్య యిముడ్చుకుని నా నుదుట ముద్దిడుతూ చెప్పాడు.

"మైత్రీ నా ప్రశ్నకు నీ ప్రశ్నలో నాకు కావలసిన జవాబు దొరికింది. ఇక నేను చేయవలసిందే మిగిలింది."

"ఏం చేస్తారూ?" నేను ఆత్రంగా అడిగాను.

విమల్ అపురూపంగా అద్భుతంగా నవ్వుతూ నాలో వివశతను రేపుతూ చెప్పాడు.

"చెప్పను యిప్పుడే."

అదిగో ఆ తర్వాత వారం రోజులకు విమల్ నుండి ఈ ఉత్తరం. నాకెందుకో భయంగా వుంది. విమల్‌ని కాదనలేను. అతన్ని కాదంటే నాకు బ్రతుకు లేదు. నేను కాదని విమల్‌తో వెళ్ళిపోతే నా చెల్లెళ్ళ బ్రతుకూ? ఎలా? ఏం చెయ్యాలి? సమయం గడిచిపోతోంది. అసలెలాంటి సమస్య వచ్చినా విమల్‌కే చెప్పుకునే నాకు విమల్‌తోనే సమస్య అయింది. ఎలా?

* * *

క్షణాలు గంటల్లా మారుతున్నాయి.

విచారమూ ఆనందమూ లేని నిర్లిప్తత నాలో. అగాధంలో జారిపడ్డ నా మనసు తపనలో వూగుతోంది. నేను విమల్‌ని మోసం చేస్తున్నానా? ఆరు గంటలయింది. నా కాళ్ళు శిలల్లా మారి నా యింటి గడపను దాటటం లేదు.

నా మనసు అతని కోసం వేధిస్తోంది. ఇప్పుడు విమల్ పంపిన ఈ ఆహ్వానాన్ని కాదంటే-మరి ఎప్పటికీ విమల్‌ని పొందలేను. విమల్ లేని నాకేమీ వద్దు. విమల్ వుంటే నాకింకేమీ వద్దు. మనసు వెర్రిదానిలా ఏడుస్తోంది. కాళ్ళు మాత్రం కదలటం లేదు.

"అక్కా" - అంటూ నా ముందుకొచ్చిన నా చెల్లెలు నన్ను చూసి-

"అదేంటేనువ్వేడుస్తున్నావా? అటు చూడు ఆయన వచ్చారు. నువ్వు కావాలంట" చివ్వున బాణంలా తిరిగి చూసాను.

గుమ్మంలో నిలువునా నా జీవిత పటంలో తన చిత్రంలా నిలబడి వున్నాడు.

"నాకు తెలుసు. నువ్వా కొండనెక్కి కాదని కాల్దన్ని రాలేనని. నాకు తెలుసు. నా మనసు లేకుండా నేను వుండలేనని. అందుకే నిన్ను తీసుకెళ్ళటానికి నేనే వచ్చాను. రా మైత్రే. ఏ మంత్రాలూ, ఏ పెండ్లీ మనకొద్దు. పెండ్లి పేరుతో కనేసి బాధ్యతల నుండి తప్పించుకునే ఈ మనుషుల నుండి నా మనసులోకి రా మైత్రే."

విమల్ చెప్పేది నాకర్థం కాలేదు.

"వెళ్ళక్కా" శకుంతలను సాగనంపే అనసూయ, ప్రియంవదల్లా నా చెల్లెళ్ళు.

"నువ్వు మాత్రం ఇక్కడ వుండవు. మీ నాన్న చల్ల నీళ్ళలో వేణ్ణీళ్ళు కలుస్తూనే వుంటాయని, నేనాయనకు మాట యిచ్చాను. వాళ్ళకు కావల సింది నువ్వు కాదు. నీ సంపాదన విమల్ ఆ మాట అంటుంటే నేను నన్ను కన్నతల్లి వైపు చూసాను. ఆమె మొహం తిప్పేసుకుంది.

చట్రాలన్నీ విరిగిపోయి నేను స్వేచ్ఛనై క్రిందటి నేను కరిగిపోయి అతని కోసం పునర్జన్మించి నేను ఎవరినో యెక్కడికి వెళ్ళాలో-అక్కడ విమల్ నిలిచి వున్నాడు-ఆహ్వానంగా చూస్తూ.

●

ప్రతిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్